# స్కైలాబ్

**- యెన్నం ఉపేందర్**

సూర్యుడు తన దినచర్య ముగించుకొని చకచకా కీసరగుట్ట కావల కనుమరుగైనాడు. అది గోధూళి వేళ. మేత కోసం వెళ్లిన పశువులు, గొర్లు సుష్టుగా మేసి ఇంటిముఖం పట్టాయి. అవి నెమరేస్తూ నెమ్మదిగా నడుస్తుంటే, గౌరుమల్లుకు చిరాకేసింది. ఎప్పుడో పొద్దు నెత్తిమీదికి వచ్చినప్పుడు తనతో తెచ్చుకున్న జొన్న గట్క మోదుగు డొప్పలో నాలుగు 'పట్లు' పట్టాడు. కడుపులో పేగులు గురగురమనటం ఎక్కువ కావటంతో తట్టుకోలేక, దుడ్డుకర్రతో గొర్ల వీపుల మీద టకటకలాడించాడు. గొర్లు పరుగెత్తటం మొదలుపెట్టాయి. వాటెనుక కాడి పశువులు కూడా పరుగందుకున్నాయి. గౌరుమల్లు చీకటి పడేసరికి మందతో పాటుగా ఇల్లు చేరాడు.

ఇంటికి చేరటమే ఆలస్యం; గౌరుమల్లు భార్యతో,

"కడుపుల పేగులు ఉండలు దిర్గుతున్నై. ఇంత కంచంలో తిండేయి" అన్నాడు.

విన్న సత్తెమ్మ గౌరుమల్ల వైపు ఓమారు చూసి,

"పొద్దున కూలికిబోయి యిప్పుడే వచ్చిన. ఎసరు మరుగుతాంది. బియ్యమేసి గుబగుబ ఉడకబెడ్త. కొంచెం ఓపిక బట్టు" అన్నది.

గౌరుమల్లుకు కోపం వచ్చింది. బలవంతాన నిగ్రహించుకున్నాడు. తానేమైనా అంటే సత్తెమ్మ ఏ కుండనో తటాలున ఎత్తేస్తుంది. యిక ఆ పూట తిండి ఉండదు.

"పోరడేడికి బోయిండు" ప్రశ్నించాడు సత్తెమ్మను.

"ఏడికి బోయిండో ఏమో! పొద్దు బెత్తెడు ఎళ్లంగనే ఆదలా బాదలా లుంగీ కట్టుకొని లేసిపోయిండు" అన్నది.

గౌరుమల్లుకు కోపం అలలా లేచింది.

"ఈమధ్య పోరడికి పెత్తనాలెక్కువైనై. ఊళ్ల పార్టీలు పెరిగేసరికి ఎచ్చులెక్కువైనై. యింత మీసకట్టు వచ్చిందో లేదో, నా అంత మగోడే లేడని ఊరుమీద బడ్డడు. ఈత సెట్టోలె పెరిగిండు గని, ఇసుమంత ఈవురం లేదు. వాన్తోటి పోరగాండ్లు ఎంతిదిగా వ్యవసాయం సేత్తండ్రు. రానీ, కాళ్లిరగ్గొడ్త" పళ్లు పటపటలాడించాడు.

ఆవేశంగా అరిచేసరికి కడుపులో యింకా ఆకలెక్కువైనట్లు అనిపించింది గౌరుమల్లుకు. వేపచెట్టు పైన గోలగా అరుస్తున్న పిచుకల వైపు చూడసాగాడు.

"పిట్ట నిన్న మొన్న గుడ్లు పెట్టింది. అప్పుడే పిల్లలు బయటికి రావటం, ఆహారం కోసం తమంతట తాము ఎగిరిపోవటం జరిగినై. వాట్ని చూసన్నా మా లింగమంతు బుద్ధి తెచ్చుకుంటే బాగుండేది" మనసులో అనుకున్నాడు గౌరమల్లు.

భార్య పిలుపు విని కాళ్లు చేతులు కడుక్కొని ఇంట్లోకి వెళ్లాడు గౌరుమల్లు.

"ఏం కూరొండినవు" ప్రశ్నించాడు భార్యని.

"ఏం కూరొండలె. పొద్దున నూరిన టమాట తొక్కుంది" అన్నదామె.

"తొక్కా?!"

"... ... ..."

"ఊఁ ఇంత కంచంలేయి"

గౌరమల్లు ఓ మామూలు రైతు. ఒక అరక పశువుల్తో పాటుగా ఓ పది గొర్లు కూడా ఉన్నాయి. ప్రతిరోజూ చీకట్లు విచ్చుకోక ముందే వాటిని తోలుకుని చెలక భూమి వైపు వెళ్తాడు. సాయంత్రం చీకటిపడే సమయానికి పశువులు, గొర్లను మేపుకొని ఇంటికొస్తాడు.

గౌరుమల్లు అన్నం మధ్యలో ఉండగా లింగమంతు వచ్చాడు. వస్తూనే,

"అమ్మా! అన్నంబెట్టే" అన్నాడు.

త్వరత్వరగా కాళ్లు చేతులు కడుక్కొని, గౌరుమల్లుకు ఎదురుగా పీటేసుకుని కూర్చొన్నాడు.

గౌరుమల్లుకు లోపల కోపం లావాల పెల్లుబికింది. అయినా కోపాన్ని బహిర్గతం చేయకుండా అన్నం తినసాగాడు.

లింగమంతు తల్లితో,

"ఏందమ్మా? టమాటా తొక్కేనా?" ముఖం చిట్లించి అడిగాడు.

గౌరుమల్లు కోపాన్ని కట్టడి చేయలేకపోయాడు.

"ఒంటరి పొట్టేలు లెక్క బలసినవు. గొడ్లకాడికో, గొర్లకాడికో పొమ్మంటే పోవుడు లేదు. నీకు రుచులు గావాల్సొచ్చినాయిరా?" అంటూ కొడుకు పైకి లేచాడు.

సత్తెమ్మ గౌరమల్లును అడ్డుకుంది.

"ఏందయ్యా! పిలగాడు సీకటి ముఖాన బోయి ఇప్పుడే కదా వచ్చింది. ఇంత తిండి తిననీయరాదూ?" కొడుకును వెనకేసుకొచ్చింది ఆమె.

గౌరమల్లుకు ఆవేశం తగ్గలేదు. ఇంత జరిగినా లింగమంతు ముఖంలో ఏ భావం లేకుండా అన్నం తినసాగాడు. గౌరుమల్లుకు అదోలా అనిపించి,

"చీ! ఇజ్జతి లేని పుట్క బతికితేంది, సస్తేంది" అంటూ కంచం విసిరికొట్టి, చద్దరు తీసుకొని ఆరుబయటకు వెళ్లాడు.

ఆరుబయట చల్లగా ఉంది. వెన్నెల్లో గొర్లు చప్పుడు చేయకుండా పడుకొని ఉన్నాయి. లింగమంతు గురించిన ఆలోచనలు గౌరుమల్లుని నిద్ర పోనీయటం లేదు.

"ఊర్ల రాజకీయాల వుణ్యమాని పోరడు తెర్లయితట్లుంది. ఎద్దోలె ఎదిగిండు గనీ, ఇంటి గురించి పట్టటం లేదాడికి. ఏం జేయాలె? పెళ్లిజేద్దునా? ముందుగాల పెద్దోడికి సెయ్యకుండా ఈడికి జేత్తే లోకమేమంటుంది? పెద్దోడికి దబ్బున పెళ్లి జేద్దామంటే ఇంక వాడి సదువు అయిపాకపాయే... ఈడికి పెళ్లి జేత్తేనే తిక్క కుదురుద్ది" నిర్ణయానికి వచ్చాడు గౌరుమల్లు. ఆ తర్వాత హాయిగా నిద్రపోయాడు.

తెల్లవారకముందే లేచి పక్కూరికి వెళ్లాడు గౌరుమల్లు. ఓ సంబంధం చూసి వచ్చాడు. భార్యతో ఆ విషయం చెప్పాడు. అది విన్న సత్తెమ్మ,

"యిప్పుడేం తొందరొచ్చింది? పెద్దోడి పెళ్లి యింక సెయ్యలేదుగా?" అన్నది.

గౌరుమల్లుకు మరలా కోపం వచ్చింది.

"పోరన్ని యింకెంత కాలం ఎనకేసుకొస్తవ్? రేప్పొద్దున వాడు సెడిపోయి బజార్న పడితే లోకం ఎవల్నంటరు? ఆరు నూరైనా పెళ్లి జరగాల్సిందే" తీర్మానించాడు గౌరుమల్లు.

నెమ్మదిగా సత్తెమ్మ పెళ్లి విషయం లింగమంతు చెవిలో వేసింది.

లింగమంతుకు లోలోన చాలా సంతోషం కలిగింది. తన తోటి వాళ్లందరికీ పెళ్లిళ్లైనయనీ ఎప్పుడు మనసులో బాధపడుతుంటాడు తాను. అందువల్ల లింగమంతు, మాట వరసకు 'నాకొద్దు' అన్నా చివరికి 'సరే' అన్నాడు.

పెళ్లి జరిగి నెల రోజులైంది. లింగమంతు ఇంకా అత్తగారింట్లోనే ఉన్నాడు. అతనికి ప్రపంచం అంతా ఆనందమయంగా ఉన్నట్లు కనిపించసాగింది. అతడు ఇలా ఆలోచించసాగాడు:

"అత్తగారింట్ల రాజభోగాలు జరుగుతున్నై. రోజు చికనో మటనో పెడ్తండ్రు. పొద్దు గుంకేసరికి మామ పోత్తాడు కల్లు పట్టుకొస్తుండు. కల్లు తాగి, కడుపునిండ తిని అలా ఆరుబయట వెన్నెల్లో... ఇంటికాడేముంది? ఎప్పుడు చూసినా కొరకొరే! గొడ్లకాడికి పోతలేననో, గొర్ల కాసేందుకు పోతలేననో ప్రాణం దీస్తరు. ఇట్లాగే ఎల్లకాలం ఉంటే ఎంత బాగుంటది?"

మరికొన్ని రోజులు గడిచాయి. ఓ రోజు లింగమంతు మామ లింగమంతుతో,

"అయ్యా! పెళ్లయి సాన రోజులైతంది. భర్తెంట భార్యుండటం, ఎవరి కుటుంబాన్ని వారు పోషించుకోడం ధర్మం. అందుకని..." మామ తనతో చెప్పాలనుకుంది లింగమంతుకు అర్థమైంది.

ఇక ఆ తరువాత అత్తగారింట్లో ఉండదలుచుకోలేదు లింగమంతు. భార్యను తీసుకుని ఇంటికి బయల్దేరాడు.

ఇంటికి వచ్చిన వారం రోజులు లింగమంతు ఇంటి గడప దాటి బయటికి రాలేదు.

'తాను ఎంత క్రియాశీలంగా ఊరి రాజకీయాల్లో పాల్గొంటున్నదీ, ఏ ఏ నాయకుల సరసన నిలబడి పార్టీ కార్యకలాపాలు కొనసాగించిందీ' భార్యకు పూసగుచ్చినట్లు చెప్పాడు, లింగమంతు.

ఆమె మనసులో, తన భర్త 'తెల్ల గుడ్డలు కట్టుకొనే పెద్దమనిషన్న' భావం ముద్రపడింది.

అత్తగారింటి నుండి వచ్చినప్పటి నుంచి కొడుకు గడప దాటి బయటకు రాకపోవటం గౌరుమల్లుకు మంటగా ఉంది. ఓ రోజు ఉదయాన,

"గొర్ల మళ్లేయ పో" గౌరుమల్లు ఆజ్ఞాపించాడు.

"నేం బోను" జవాబిచ్చాడు లింగమంతు.

తండ్రికి సర్రున కోపం వచ్చింది.

"ఎందుకు బోవు"

"ఎందుకు బోవాల"


"తినే తిండి ఎవడ్ది"

"అన్న గొర్లకాడికి పోతండా"

"అన్న సదువుకుంటండు"

"సదువుకుంటే? అన్న భాగం పని కూడా నేనే సెయ్యాల్నా?"

"ఓహో! అదా సంగతి. భాగాల వరకొచ్చిందా యవ్వారం. యింగ జూడు. ఏరు బోస్త యిప్పటికిప్పుడు. నీ భాగం నువ్వు జూసుకో. మా భాగం మేం జూసుకుంటం" ఇంట్లోకి పరుగెత్తాడు గౌరుమల్లు.



బియ్యం, పప్పులు, వడ్లు పంచి యిచ్చాడు గౌరుమల్లు. ఆ ఇంటిని రెండుగా చేసి, ముందు గది లింగమంతుకు ఇచ్చాడు.

యివిలా జరుగుతుంటే గౌరుమల్లు భార్య మౌనాన్ని వహించింది. పల్లెత్తు మాటన్నా భర్త సహించి ఊరుకుండే స్థితిలో లేదని ఆమెకు అర్థం అయింది.

కాలం గడవసాగింది. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొని వ్యవసాయం కుప్పకూలింది. గౌరుమల్లు తీసుకొచ్చిన అప్పులు బాగా పెరిగాయి.

షావుకారు, "ఏం జూసి డబ్బియాల్లని" పెదవి విరిచాడు.

ఈ పరిస్థితుల్లో తన బావలేమన్న సహాయం చేస్తారేమోనని పక్కూరికి వెళ్లాడు గౌరమల్లు. విషయం తెలుసుకున్న గౌరమల్లు బావలు ముఖం చిట్లించారు. చెల్లెండ్లు గౌరమల్లుతో,

"ఏముందన్నా ఈ రోజులల్ల. ఎక్కడ వీసం పైసలు పుట్టేట్లు లేదు. మీ బావలే నానా యిబ్బందులు పడ్తండ్రు" అన్నారు. వారు తియ్యతియ్యగా రెండు మాటలు మాట్లాడి వెనువెంటనే గౌరుమల్లును వెనక్కి పంపించేశారు. గౌరుమల్లుకు ముల్లు గుచ్చుకున్నట్లనిపించింది.

"గీళ్ల పెళ్లీలకేనా నేను రెక్కలు ముక్కల్జేసుకుంది! యియాల నాలుగు రాళ్లు కలిగేసరికి నేను కనిపించకుంద బోయిన" మనసులో అనుకున్నాడు గౌరమల్లు.

ఉసూరుమంటూ ఇంటికి తిరిగొచ్చేసరికి, గౌరమల్లు భార్య ఇల్లు ఆవరణంతా జనంతో నిండి ఉంది. పక్కింటి జానయ్య అరుస్తున్నాడు.

జానయ్య, గౌరుమల్లు లేనిది చూసి, చెలక గట్లు మార్చి కొంత భాగం తన చెలక భూమిలో కలుపుకున్నాడట. ఆ విషయం తెలుసుకొని లింగమంతు జానయ్యను చితకబాదాడట.

"నా కొడుకులు రానీయి. ఈ రేత్రి నీ యింటిని తగులబెడ్త" జానయ్య అరుస్తున్నాడు.

ఆ రాత్రంతా గౌరుమల్లు ఇంటికి కాపలా కాశాడు. తెల్లవారకముందే గౌరుమల్లుకు ఆ ఊరి పెద్దమనుషుల నుంచి పిలుపొచ్చింది. జానయ్య పంచాయతీ పెట్టించాడని గౌరమల్లు అర్థం చేసుకున్నాడు.

సాయంత్రం రచ్చబండ దగ్గరికి గౌరుమల్లు వెళ్లాడు. గౌరుమల్లును పెద్దమనుషుల కోరుకొమ్మన్నారు. గౌరమల్లుకు తప్పలేదు. ఓ వారం రోజుల తర్వాత తిరిగి సమావేశం కావాలని పెద్ద మనుషులు నిర్ణయించుకున్నారు. ఇంతలో ఎవరో పిడుగులాంటి వార్తను మోసుకొచ్చారు.

'ఏదో వారి ఊరిమీద పడబోతుందనీ, అందరూ దాని కింద పడి నలిగి చనిపోతారనీ' ఆ వార్త సారాంశం.

అంతే! విన్నవారు కలవరపడ్డారు. ఆ వార్త మోసుకొచ్చిన వాడితో, షావుకారు ఇంటికి పరుగెత్తారు. అప్పటికే షావుకారు ఇల్లంతా జనంతో నిండి ఉంది. రేడియో వాల్యూమ్ పెద్దగా చేసి అందరు చెవులు రిక్కించి వింటున్నారు. విషయం అందరికి అర్థమైంది.

"ఇస్కిలాబట. ఊరిమీద పడి అందరు సస్తరట" కూలబడ్డాడు గౌరుమల్లు.

"ఇస్కిలాబు కాదు నాయనా, స్కైలాబ్" సరిచేశాడు లింగమంతు.

"ఏదోలే. ఇస్కిలాబు మీద పడి మనమందరం సచ్చిపోతామా?" ఆవేదనగా ఆకాశం వైపు చూస్తూ అన్నాడు గౌరుమల్లు.

"నాయనా! మనమందరం కలిసే ఉందామె" మాటలు కూడబలుక్కుంటూ అన్నాడు లింగమంతు.

అనుకోని ఆ మాటలకు గౌరుమల్లు ఆశ్చర్యానికి లోనైనాడు. కళ్లలోకి నీళ్లు తీసుకున్నాడు.

ఆ రాత్రంతా గౌరుమల్లు కుటుంబం ఆనందంగా ముచ్చట్లు చెప్పుకుంటూ గడిపారు. స్కైలాబ్ విషయం అందరి మనసులో పేలని బాంబులా ఉంది.

తెల్లవారింది. షావుకారు రేడియో తీసుకొని రచ్చబండ దగ్గరికి వచ్చాడు. ఊరు ఊరంతా అక్కడ గుమికూడారు. షావుకారు రేడియో వింటూ ఎప్పటికప్పుడు జనానికి తాజా సంగతులు తెలియజేస్తూనే ఉన్నాడు. జనం, తమకు చావు తప్పదని నిర్ణయానికొచ్చారు. అక్కడే ఉన్న పంతులుగారు,

"విన్నారు కదా! మనం చావటం తథ్యం. 'జాతస్యహో ధృవో మృత్యుః' అన్నారు కదా గీతలో. పుట్టిన జీవి గిట్టడం తప్పనిసరి. చావును తప్పించడం ఎంతవారికీ సాధ్యం కాదు. అయినా జీవితం మిథ్యండీ! ఇవాళ ఉండి రేపు పోతం. ఎప్పుడైనా మనం పోయేవాళ్లమే. వచ్చేప్పుడు ఏం తీసుక రాలేదు. పోయేటప్పుడు ఏం తీసుక పోయేది లేదు. నడమంతర సిరి నడమనే పోద్ది. అంతా మాయ" సుదీర్ఘంగా సెలవిచ్చాడు, తన చేతి వేళ్లకున్న ఉంగరాల్ని చూసుకుంటూ.

పంతులు మాటలు విన్న లింగమంతు మనసులో,

"పంతులు యిప్పుడు చావు గురించి, నడమంతర సిరి గురించి సెప్తండు గానీ, నా పెళ్లికి పది రూపాయలు

తక్కువిస్తే నానా అల్లరి జేసిండు" అనుకున్నాడు.

జనానికి తాము చావడం ఇక తప్పదనీ గ్రహించి, ఉన్న సమయాన్ని ఎలా 'గడపాలో' ఆలోచిస్తూ తమ తమ ఇళ్లకు వెళ్లారు.

లింగమంతు ఇంటికి వెళ్లేసరికి పక్కింటి జానయ్య తన తండ్రితో మాట్లాడటం గమనించాడు.

"ఏమో అన్నా! ఏదో ఆశపడి గట్టు తెంపి కొద్దిగంత నీ భూమి కలుపుకున్న. ఎవరి భూమీ, ఎవరి ఆస్తి..." జానయ్య అంటున్నాడు.

ఇంతలో గౌరుమల్లు చెల్లెండ్లు, బావలు, వారి పిల్లలూ వచ్చారు. వస్తూనే గౌరుమల్లు చెల్లెండ్లు బోరున ఏడ్వసాగారు. గౌరుమల్లు వారిని ఊరడించాడు.

స్కైలాబ్ పుణ్యమాని, ఊరంతా సమిష్టి కుటుంబం అయింది. ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది. గౌరుమల్లు రెండు గొర్రెపోతుల కోయించాడు. జానయ్య నాటుసారా ఏర్పాటు చేశాడు. ఎవరిష్టం వచ్చినట్లు వారు తిన్నారు, తాగారు. రాత్రి పగలు లేకుండా జనం ఒకరితో ఒకరు ముచ్చట్లు చెప్పుకున్నారు. రాత్రివేళ జనం తమ ఇళ్లకు గడియ వేయలేదు. షావుకారు తన ఖజానాకు తాళం వేయకుండానే రేడియోను అంటిపెట్టుకున్నాడు. పంతులు ఏవో మంత్రాలు రాత్రి పగలు తేడా లేకుండా చదువుతున్నాడు. అందరు కూడా తాము చావబోతున్నామనీ, బతికినంతసేపు ఆనందంగా గడపాలనీ నిర్ణయించుకున్నారు. కాలం భారంగా ఖర్చైతోంది.

ఓ రోజు షావుకారు దుఃఖమనస్కుడై రేడియో 'ఆన్' చేశాడు. 'ప్రభుత్వం స్కైలాబ్‌ను సముద్రంలో పడవేయించిందని' రేడియోలో చెబుతున్నారు. షావుకారు తన చెవుల్ని తాను నమ్మలేకపోయాడు. తాను తప్పుగా విన్నాడేమోనని మరోసారి విన్నాడు. అదే విషయాన్ని న్యూస్ రీడర్ మరల మరల చెబుతున్నాడు. షావుకారు ఆనందంతో అరిచాడు. బజార్లోకి రేడియో పట్టుకొని పరుగెత్తాడు. క్షణాల్లో ఆ వార్త ఊరంతా పాకింది. జనం మూడ్ ఒక్కసారిగా మారిపోయింది.

షావుకారు, తాను తన ఖజానాకు తాళం వేయలేదని జ్ఞాపకం వచ్చి, రేడియోను జాగ్రత్తగా చేత్తో పట్టుకొని ఇంటికి పరుగెత్తాడు.

గౌరుమల్లు తాను సంతోషంతో ఇంటికి వెళ్లేసరికి లింగమంతు తన సామానంతా తీసుకొని ముందు గదిలోకి మారాడు. తండ్రిని చూస్తూనే తలదించుకొని తనింట్లో సామాను సర్దటంలో మునిగిపోయాడు. చెల్లెండ్రు, బావలు గౌరుమల్లుతో 'పోయొస్తామని' చెప్పి సరసరా వెళ్లిపోయారు.

జానయ్య, గౌరుమల్లుకు వినబడేటట్లు,

"రేపు పంచాయతీ తీర్మానం పెట్టిస్త. నా భూమిని అన్యాయంగా ఎట్ల గుంజుకుంటడో చూస్త. పోలీసోల్ల దగ్గరికి బోత. లేదంటే కోర్టుకు బోత. నన్నెవరు ఆపుతరో చూస్త" అన్నాడు.

గౌరుమల్లుకు ప్రపంచం శూన్యంలా గోచరించింది. వేపచెట్టు కింద కూలబడి తనలో,

"గా ఇస్కిలాబు మీద పడ్డా బాగుండు, దెబ్బకు సచ్చి ఊరుకుందును" అనుకున్నాడు.

## పుస్తక సమీక్ష




ఒంగోలులో 2003 సెప్టెంబరు ఏడో తేదీ డా॥ ఎన్.శైలజ అధ్యక్షతన జరిగిన సభలో కథా రచయిత అల్లం రాజయ్య ఆవిష్కరించిన పుస్తకమే 'కథ-2002'. ఇది పదమూడో సంకలనం. 'కథా సాహితి' క్రమం తప్పకుండా ఇప్పటికి పన్నెండు సంకలనాలు అందించింది. తనకంటూ కొందరు అభిమానుల్ని ఏర్పరచుకొన్నట్లే, ఆశ్చర్యకరంగా కొందరు విమర్శకుల్ని కూడా ఏర్పరచుకోగలిగింది.

"ఇది మా 13వ సంకలనం. ఇప్పటికి 102 మంది రచయితలవి 175 కథలు ప్రచురించాం. ప్రతి సంవత్సరం కనీసం నలుగురైదుగురినైనా కొత్త రచయితల్ని పరిచయం చేస్తున్నాం. ఇవాళ దాదాపు ఒక కొత్త కథకుల తరం మన ముందున్నది. వీరంతా తమ తమ పరిధుల్లో తమకు అర్థమైన మేరకు సమాజాన్ని, దాని చలనశీలతను చిత్రిస్తున్నారు. అందరూ సమాజాన్ని, కథా రచనను సీరియస్‌గా తీసుకున్నవాళ్లే. ఈ కొత్త తరం కథా రచయితలను ఎప్పటికప్పుడు పాఠకులకు పరిచయం చేయగలుగుతున్నామన్న తృప్తి వుంది. ఈ కథలను అంచనా వేసే బాధ్యత విమర్శకులది" అంటూ సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ 'మా మాట'లో అనడం గమనార్హం.

వాడ్రేవు చినవీరభద్రుడి వ్యాసకథ 'ప్రశ్న భూమి'. చాలా పెద్ద కథ. ఎంత ప్రభుత్వాధికారైనా న్యాయస్థానంలో అంతసేపు ఉపన్యసిస్తాడని అనుకోలేం. పైగా పది మందిలో, తానొక బలహీన క్షణంలో పొందిన మరో లైంగికానుభవాన్ని గురించి ప్రస్తావించడం, అందులోనూ ఆ కేసుకి సంబంధం లేని ఆ సంఘటన గురించి చెప్పడం కొంచెం 'అతి' అనిపించినా రాజ్య నేర స్వభావాన్ని గురించి విపులీకరించడం వల్లే ఆ కథని ఎంపిక చేసినట్లు అర్థమవుతోంది. రాయలసీమలో ఫ్యాక్షన్ ముసుగులో నిరుపేదలు, అమాయకులు ఎలా ఫ్యాక్షనిస్టులకి నిచ్చెనలుగా ఉపయోగపడుతున్నారో తెలిపే కథ ఇనాయతుల్లా కథ 'నిచ్చెన'. బహుళజాతి సంస్థల పానీయాలను వ్యతిరేకిస్తూ వెలసిన 'పెండెం సోడా సెంటర్' కథ జాతీయ భావాల వ్యాప్తికి దోహదపడే కథ. ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం ఎందుకవుతుందో తెలిపే కథ ఇది. బెజ్జారపు రవీందర్ కథ 'నిత్య గాయాల నది'. ఆంధ్ర ప్రాంతపు సమరవీరులకు లభించినంత ఖ్యాతి, తెలంగాణా ప్రాంతపు సమరవీరులకు లభించడం లేదన్నది ఇతివృత్తం. చేపల చెరువుల విస్తరణ నేపథ్యంలో తన పొలం అమ్ముకోని వెంకటేశ్వర్లు ఎలా హత్యకు గురయ్యాడో తెలిపే కథ 'గుండ్లకమ్మ తీరాన'. రాజుల పాత్రలు, సామ్రాజ్యాల అధికారాల ద్వారా అర్థవంతమైన జీవితం కోసం మార్గాన్ని అన్వేషించే కథ కమలకుమారి రాసిన 'చూపు'. చేతివృత్తులవారు ఎలా మోసాలకు గురవుతున్నారో తెలిపేదే సుంకోజి దేవేంద్రాచారి కథ 'అన్నం గుడ్డ'. రాజకీయాలు మనిషుల్ని ఎలా విడదీస్తున్నాయో తెలిపేదే వి.ప్రతిమ రాసిన 'రాచపుండు'. డా॥ యం.హరికిషన్ కథ 'ఒక చల్లని మేఘం' బందిఖానా చదువుల పట్ల నిరసన. ఒక సుందర స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి పడాల్సిన శ్రమను ప్రతీకాత్మకంగా చిత్రించిన కె.శ్రీకాంత్ కథ 'నిశ్శబ్దపు పాట'. చంద్రలత రాసిన 'ఆవర్జా' కథ స్త్రీల పట్ల వివక్షని ప్రశ్నించే కథ. డా॥ వి.చంద్రశేఖరరావు రాసిన 'ఆవు-పులి మరికొన్ని కథలు' గ్లోబలైజేషన్ దుష్ఫలితాల ఫలితాలను వివరించే కథ. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నది అఫ్సర్ రాసిన 'గోరిమా' కథ.

కథ-2002లో వ్యవస్థ వికృత స్వరూపాన్ని రచయితలు సంపూర్ణంగా ఆవిష్కరించారు. ఆధునిక జీవితంలో వుండే సంక్లిష్టతలన్నీ ఇందులో ఉన్నాయి. అయితే జీవితంలోని మాధుర్యం, ఆత్మీయతలు, ప్రేమానురాగాలు మాత్రం ఇందులో కనిపించవు. అదే 'కథ' సిరీస్ మీద గత కొన్ని సంవత్సరాలుగా వస్తోన్న ప్రధాన విమర్శ కూడా.

(**కథ-2002**; సంకలనకర్తలు: వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్; పుటలు: 214; వెల: రూ.45/-; ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు, నవోదయా బుక్‌హౌస్, నవయుగ బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం...)

**- సిహెచ్.లక్ష్మి**